యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం

- మాజీ మంత్రి డీకే అరుణ

ధన్వాడలో మహిళలతో మట్లాడుతున్న డీకే అరుణ

ధన్వాడ/మరికల్, ఫిబ్రవరి 6 : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే నారాయణపేట జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మాజీ మంత్రి డీకే అరుణ అన్నారు. మంగళవారం ధన్వాడలో నిర్వహించిన గావ్ చలో కార్యక్రమంలో రెండో రోజూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను గతంలో మంత్రిగా ఉన్న సమయంలో ధన్వాడకు జూనియర్ కళాశాల మంజూరు చేయించానని చెప్పారు. అదేవిధంగా గ్రామంలో సీసీ రోడ్లు వే యించి గ్రామాభివృద్ధికి కృషి చేశానని, తాను పుట్టిన గడ్డకు న్యాయం చేస్తానని ఆమె ప్రకటించారు. అనంతరం మరికల్‌లో సర్పంచ్ కస్పే గోవర్ధన్‌ను డీకే అరుణ కలిసి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి మద్దతు తెలపాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీకి నారాయణపేట నుంచి రాంచంద్రాపూర్ వరకు హైవే ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు ఇచ్చామని, త్వరలో నారాయణపేట రోడ్డు హైవే రోడ్డుగా మారుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నర్సన్‌గౌడ్, రాంచంద్రయ్య, ఉమే శ్, గోవర్ధన్‌గౌడ్, ఉదయభాను, శ్రీనివాస్‌గౌడ్, నారాయణ,మా కం సురేందర్, వెంట్రాంరెడ్డి, మాధవి పాల్గొన్నారు.

పోచమ్మకు మాజీ ఎమ్మెల్యే పూజలు

పెద్దచింతకుంటలో జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్

మరికల్, ఫిబ్రవరి 6 : మండలంలోని పెద్దచింతకుంటలో మంగళవారం పోచమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ దంపతులు హాజరై పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలోనూ వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డితోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యనందించాలి

- ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 6 : ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన విద్యను అందించి విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని పేట ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి అధ్యాపకులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ లెక్చరర్ల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ రాములు, కోశాధికారి రాజేశ్, ప్రధాన కార్యదర్శి పరశురాం, ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, అనంతరెడ్డి, విజయ్‌కాంత్ తదితరులు పాల్గొన్నారు.

పురాతన విగ్రహాలు ఆలయానికి తరలింపు

కృష్ణ, ఫిబ్రవరి 6 : కర్ణాటక–తెలంగాణ సరిహద్దులోని కృష్ణానదిలో సోమవారం బయటపడిన పురాతన విగ్రహాలను గూడెబల్లూర్‌కు తరలించారు. గ్రామంలోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో భద్రపరిచారు. నదిలో లభ్యమైన మూడు విగ్రహాలను మంగళవారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో గ్రామానికి తరలించారు.

కనీస వేతనాలు, సదుపాయాలు కల్పించాలి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 6 : ఇతర ప్రాంతాల నుంచి వచ్చి వివిధ పనులు చేసుకుంటు జీవనం సాగిస్తున్న కూలీలకు అవసరమైన సహకారం అందించాలని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతోపాటు ఇటుక బట్టీల వ్యాపారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇటుక బట్టీలలో పనిచేసే కార్మికులకు కనీస వేతనాలతోపాటు వారు నివసించే చోట తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

14 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్నవారిని ఎట్టి పరిస్థితుల్లో పనిలో పెట్టుకోకూడదని, ఇటుక బట్టీల వ్యాపారులు దీనిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్మిక శాఖ ఉప కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్, అసిస్టెంట్ కమిషనర్ యాదయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్యోతి, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

పద్మశ్రీ అవార్డు గ్రహీతకు సన్మానం

మద్దూర్ (కొత్తపల్లి)/దామరగిద్ద, ఫిబ్రవరి 6 : పద్మ శ్రీ అవార్డు గ్రహీత దామరగిద్దకు చెందిన దాసరి కొండప్పను మంగళవారం మద్దూర్ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సుధాకర్‌రెడ్డితోపాటు సిబ్బంది పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా జెడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులు, 2002–2003 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయనకు రూ.5,101 ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా దామరగిద్ద మండల కేంద్రంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత దాసరి కొండప్పను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. పురాతన కళను అంటిపెట్టుకుని ప్రజలకు తాంత్రిక వాద్యం గొప్పతనం గురించి వివరించి మన మండలానికే కాకుండా నారాయణపేట జిల్లాకే పేరు తెచ్చారని ఆర్యవైశ్య సంఘం సభ్యులు శెట్టి శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, రాము, మధు, ప్రభాకర్ ఉన్నారు.

రెండు డీసీఎంలు ఢీకొని ఇద్దరు మృతి

- డివైడర్‌ను దాటి దూసుకొచ్చిన వాహనం
- రోడ్డుపై చేపల డీసీఎం బోల్తా
- చేపలను తీసుకెళ్లేందుకు స్థానికుల పోటీ

మూసాపేట (అడ్డాకుల), ఫిబ్రవరి 6 : డివైడర్‌ను దాటి అవతలి రోడ్డుపైకి దూసుకెళ్లి మరో వాహనాన్ని ఢీ కొట్టడంతో ఇద్దరు మృతి చెందిన ఘటన అడ్డాకుల శివారులో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకున్నది. ఏఎస్సై మన్యం, స్థానికుల కథనం మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లా రసూల్‌పల్లికి చెందిన సుధాకర్ (35) హైదరాబాద్ నుంచి బెంగళూరుకు కూరగాయలు తీసుకొచ్చేందుకు డీసీఎంలో వెళ్తున్నాడు. మంగళవారం తెల్లవారుజామున అడ్డాకుల జాతీయ రహదారిపై ఉన్న స్నేహ చికెన్ పరిశ్రమ వద్దకు రాగానే డీసీఎం అదుపుతప్పి డివైడర్‌ను దాటి ఎదురుగా చేపల లోడుతో వస్తున్న డీసీఎంను ఢీకొట్టి బోల్తాపడింది. దీంతో సుధాకర్ అక్కడికక్కడే మృతి చెందగా.. మరో డీసీఎంలోని క్లీనర్ హుమ్మద్ హుస్సేన్ క్యాబిన్‌లో చిక్కుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు, ఎల్‌అండ్‌టీ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని 40 నిమిషాలపాటు శ్రమించి హుస్సేన్‌ను బయటకు తీశారు. జిల్లా దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పేర్కొన్నారు. ప్రమాదంలో చేపలన్నీ రోడ్డుపై పడడంతో స్థానికులు, వాహనదారులు దొరికిన కాడికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై విచారిస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED
★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం.
జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-319433-All

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్రెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్ టౌన్, ఫిబ్రవరి 6 : రాష్ట్రంలోని పేదప్రజల అందరికీ సంక్షేమ పథకాలను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ఉద్దేశమని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం మక్తల్ క్యాంప్ కార్యాలయంలో తాసీల్దార్ సువర్ణరాజ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్క నిరుపేద కుటుంబానికి సంక్షేమ పథకాలు చేరాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారంగా ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేసి ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ వనజతోపాటు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కృష్ణ మండలంలో..

కృష్ణ, ఫిబ్రవరి 6 : మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు పెద్ద పీట వేస్తున్నదని, త్వరలో కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు రూ.లక్షతోపాటు తులం బంగారం కూడా అందజేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ పూర్ణిమావెంకట్‌రెడ్డి పాటిల్, ఎంపీడీవో యశోద, తాసీల్దారు దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నర్వ మండలంలో..

నర్వ, ఫిబ్రవరి 6 : నర్వ మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం సాయంత్రం మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో 73 మంది లబ్ధిదారులతోపాటు వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

రేషన్ సబ్ డిపో ప్రారంభం

మాగనూరు, ఫిబ్రవరి 6: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఓబులాపూర్ గ్రామంలో రేషన్ సబ్ డిపోను ఏర్పాటు చేసినట్లు తాసీల్దార్ సతీశ్‌కుమార్ తెలిపారు. మంగళవారం రేషన్ సబ్ డిపోను మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకటయ్య, ఎంపీపీ శ్యామలమ్మ, మాజీ సర్పంచులు ఆనంద్‌గౌడ్, నారాయణతోపాటు మండల నాయకుడు శివరాంరెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

- నారాయణపేట కలెక్టర్ శ్రీహర్ష

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 6 : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్, రవాణా, ఆర్‌అండ్‌బీ అధికారులు సంయుక్తంగా కృషి చేయాలని నారాయణపేట కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. మంగళవారం పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో కృష్ణ, మక్తల్ రహదారితోపాటు జాతీయ రహదారి ఆనుకొని ఉన్న గ్రామాల వద్ద రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఆయా ప్రాంతాల్లో రోడ్డు ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో భద్రతా సామగ్రి, రేడియం స్టిక్కర్లు అమర్చాలన్నారు. మైనర్ డ్రైవింగ్‌ను నియంత్రించాలన్నారు. బస్టాండ్ వద్ద సాయంత్రం వేళల్లో ఈవ్ టీజింగ్ జరుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీ యోగేశ్ గౌతమ్ మాట్లాడుతూ ప్రతి ఏటా జరుగుతున్న మరణాల్లో రోడ్డు ప్రమాద మరణాలే ఎక్కువగా ఉన్నాయని, రోడ్డు ప్రమాద మరణాలు నియంత్రించాలంటే ట్రాఫిక్ నియమాలు, వేగ నియంత్రణ పాటించాలన్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలో ఉండే ప్రాంతాలైన ద్వారకా స్కూల్, ఎర్రగుట్ట, లింగంపల్లి, అంత్వార్ గేట్ తదితర ప్రాంతాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఎస్పీలు వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, ఆర్టీవో మౌనికగాంధీ, ఆర్‌అండ్‌బీ డీఈ రాములు, మున్సిపల్ కమిషనర్ సునీత పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి

గంగాపూర్ జాతర ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న శివేంద్రప్రతాప్

జడ్చర్ల, ఫిబ్రవరి 6 జడ్చర్ల మండలంలోని గంగాపూర్‌లో లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలను ఈనెల 10నుంచి నిర్వహించనున్న జాతరలో భక్తులకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ మండల అధికారులకు ఆదేశించారు. మంగళవారం జడ్చర్ల తాసీల్దార్ కార్యాలయంలో గంగాపూర్ జాతర ఏర్పాట్లపై వివిధశాఖల మండల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగాపూర్ జాతరలో పారిశుధ్యలోపం లేకుండా చూడాలని, ఎప్పటికప్పుడు చెత్తాచెదారం లేకుండా జాతర ప్రాంతాన్ని శుభ్రం చేయాలని సూచించారు. అదేవిధంగా భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని, జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో తాసీల్దార్ సత్యనారాయణరెడ్డి, సీఐ ఆదిరెడ్డి, ఆలయ ఈవో దీప్తిరెడ్డి, డిప్యూటీ తాసీల్దార్ రాజీవ్‌రెడ్డి, ఎంపీవో జగదీశ్, ఆర్ఐ రాఘవేంద్ర, సలావుదీన్, విశ్వం, జనార్దన్‌రెడ్డి, గోపాల్‌యాదవ్, రాంచంద్రయ్య, నయీం, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

జీవిత లక్ష్యంపై దృష్టి సారించాలి

విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్పీ యోగేశ్ గౌతమ్

నారాయణపేట, ఫిబ్రవరి 6 : విద్యార్థులు జీవిత లక్ష్యంపై దృష్టి సారించి తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎస్పీ యోగేశ్‌గౌతమ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలీస్ కళా బృందం వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జీవితంలో లక్ష్యాన్ని చేరుకోవడానికి ఎన్నో ఆటంకాలు వస్తుంటాయని, వాటిని అధిగమించి లక్ష్యాన్ని సాధించాలన్నారు. ప్రతి కళాశాలలో యాంటీ ర్యాగింగ్ టీంలు ఏర్పాటు చేశామని, ప్రతి పాఠశాలలో ఫిర్యాదుల బాక్సులు ఏర్పాటు చేశామన్నారు. ఎలాంటి ఫిర్యాదులు ఉన్నా ఆ బాక్సులో వేయాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచి ఆ ఫిర్యాదుపై విచారణ చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు కళాశాలకు వచ్చే సమయంలో ఆకతాయిలు వేధిస్తే డయల్ 100 లేదా, షీ టీమ్ 8712670398 నెంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులతో సోషల్ మీడియాలో చాటింగ్ చేయవద్దన్నారు. ఆన్‌లైన్ వేధింపులు, బ్లాక్ మెయిల్ చేయడం వంటి ఘటనలపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని అడ్డుకట్ట వేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డీఎస్పీ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ రంగారెడ్డి, ఎస్సై వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి ఇద్దరి మృతి

జడ్చర్లటౌన్, ఫిబ్రవరి 6 : జడ్చర్ల రైల్వేస్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి రైలు కిందపడి మృతి చెందాడు. మహబూబ్‌నగర్ రైల్వే ఎస్సై అక్బర్ కథనం ప్రకారం జడ్చర్లలోని ఫకీర్‌నగర్‌కాలనీకి చెందిన యూసుఫ్(34) అనే వ్యక్తి మృత దేహాన్ని మంగళవారం స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో రైలుపట్టాలపై పడి ఉండడాన్ని రైల్వే సిబ్బంది గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు రైల్వే ఎస్సై అక్బర్ ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతుడి వద్ద లభించిన ఆధారాల మేరకు పట్టణంలోని ఫకీర్‌నగర్‌కాలనీకి చెందిన యూసుఫ్‌గా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. ఆ తర్వాత పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల మార్చురీకి తరలించారు. మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని రైలు కిందపడి యూసుఫ్ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. అలాగే మండలంలోని గొల్లపల్లి రైల్వేస్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి మృతి చెందినట్లు మహబూబ్‌నగర్ రైల్వే ఎస్సై అక్బర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం గొల్లపల్లి రైల్వేస్టేషన పరిధిలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి గుర్తు తెలియని రైలు కిందపడి మృతి చెందినట్లు రైల్వే సిబ్బంది రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. మహబూబ్‌నగర్ రైల్వే ఎస్సై అక్బర్ ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేశారు. మృతుడికి కుడిచేయి లేనట్లు గుర్తించారు. భిక్షాటన చేస్తూ ప్రమాదవశాత్తు రైలు కిందపడి మృతి చెందినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మహబూబ్‌నగర్ మార్చురికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

- ఎంపీవో విజయకుమార్ • నేటి నుంచి 15వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్

భూత్పూర్, ఫిబ్రవరి 6 : గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిని సారించాలని ఎంపీవో విజయకుమార్ కోరారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు వైస్ ఎంపీపీ నరేశ్‌గౌడ్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు. ఈ పారిశుధ్య కార్యక్రమాలను బుధవారం నుంచి ఈనెల 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారులు తాసీల్దార్ రాజు, ఏవో మురళీ, ఏఈవో స్వామి, ఎంపీటీసీలు నిర్మల, సాయిలు, ఊషన్న, పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మక్తల్‌లో..

మక్తల్ టౌన్, ఫిబ్రవరి 6 : గ్రామీణ ప్రాంతాలన్నీ పరిశుభ్రంగా ఉండాలనే లక్ష్యంతో బుధవారం నుంచి మండలంలో పారిశుధ్య వారోత్సవాలు ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీవో సద్గుణ మంగళవారం తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మక్తల్ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈనెల 7 నుంచి 15వ తేదీ వరకు గ్రామాల్లో చెత్తా చెదారం తొలగించడంతోపాటు డ్రైనేజీలను శుభ్రం చేయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ స్పెషల్ ఆఫీసర్లతోపాటు యువకులు పాల్గొని గ్రామాలను చక్కదిద్దుకోవాలని సూచించారు.

ఉన్నత పాఠశాల భేష్

నవాబ్‌పేట, ఫిబ్రవరి 6 : నవాబ్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయుల పనితీరు భేషుగ్గా ఉందని.. అందుకు తగ్గట్టుగా విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు తీసుకురావాలని డీఈవో రవీందర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలతోపాటు చౌడూర్, లింగంపల్లి, నవాబ్‌పేట కేజీబీవీ పాఠశాలల్ని ఆయన తనిఖీ చేశారు. మొదట నవాబ్‌పేట ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి అక్కడి జీహెచ్ఎం నాగ్యానాయక్ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల విద్యాభివృద్ధికి చేస్తున్న కృషిని తెలుసుకొని నాగ్యానాయక్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంలు దశరథ్‌నాయక్, సీఎంవో బాలుయాదవ్, హెచ్ఎంలు తిరుపతయ్య, రమాకాంత్, సీఆర్పీ జనార్దన్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు విద్యార్థి ఎంపిక

భూత్పూర్ : క్రీడాకారులను అభినందిస్తున్న జీహెచ్ఎం రాణిమాలినీదేవి

నారాయణపేటరూరల్, ఫిబ్రవరి 6 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రెజ్లింగ్ పోటీలు ధన్వాడలో మంగళవారం జరిగాయి. ఇందులో పేట శ్రీ సాయి కోఆపరేటివ్ కళాశాలకు చెందిన బీ మహేశ్ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు, నేడు వరంగల్‌లో జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి మహేశ్‌ను డీఐఈవో సుదర్శన్‌రావు, డీఈసీ మెంబర్ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ రామకృష్ణతో పాటు యాజమాన్యం శాలువాతో సన్మానించారు.

సత్తా చాటిన విద్యార్థులు

భూత్పూర్, ఫిబ్రవరి 6 : మండలంలోని కరివెన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు యాదాద్రి జిల్లాలో సోమవారం జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ రగ్బీ పోటీల్లో సత్తా చాటారు. మంగళవారం కరివెన పాఠశాల ఆవరణలో నిర్వహించిన రగ్బీ పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు జగన్, మౌనికలను జీహెచ్ఎం రాణిమాలినీదేవి, వ్యాయామ ఉపాధ్యాయుడు మౌలాలీ విద్యార్థులను అభినందించారు.

జాతీయ స్థాయికి ఎదగాలి

ధన్వాడ, ఫిబ్రవరి 6 : గ్రామీణ ప్రాంత క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలని ధన్వాడ ఏస్సై రమేశ్ సూచించారు. మంగళవారం ఉమ్మడి జిల్లా రెజ్లింగ్ పోటీలను బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ పోటీలను ఎస్సై రమేశ్ ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యమన్నారు. క్రీడలతో మానసికోల్లాసం, స్నేహ సంబంధాలు పెంపొందుతాయని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఉపాధ్యాయులు నర్సింహులు, బసన్న, రెజ్లింగ్ కార్యదర్శి రవికుమార్, నెల్సన్, పీఈటీలు సాయినాథ్, అనంతసేనా, కోచ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

మరికల్, ఫిబ్రవరి 6 : వాహనదారులందరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని మరికల్ ఎస్సై మురళీ సూచించారు. మంగళవారం మండలకేంద్రంలో నెహ్రూ యువ కేంద్రం, మరికల్ వికాస వేదిక ఆధ్వర్యంలో రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరి హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, రాజశేఖర్, అశోక్, శివరాజ్, పవన్, రవి, భాను, నాగరాజ్, నవీన్, మోహన్, అన్వర్, జగదీశ్ పాల్గొన్నారు.

సామాజిక కార్యకర్త మృతి

మూసాపేట, ఫిబ్రవరి 6 : మండలంలోని నిజాలాపూర్ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త బొబ్బిలి బాల్‌చందర్ (58) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. బాల్‌చందర్ మూడు దశాబ్దాలుగా పలు సేవా కార్యక్రమాలు చేశారు. అదేవిధంగా మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన వారికి కూడా సేవా కార్యక్రమాలు చేశారు. బాల్‌చందర్ మృతి చెందిన విషయం తెలిసి స్థానిక జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్, ఎంపీటీసీ సీజీ గోవర్ధన్, నాయకులు సానుభూతి తెలియజేస్తూ సంతాపం ప్రకటించారు.

వైన్ షాపులో చోరీ

మూసాపేట, ఫిబ్రవరి 6 : మూసాపేట వైన్ షాపులో చోరీ జరిగింది. ఎస్సై సూజాత కథనం మేరకు మూసాపేట వైన్ షాపు వేములస్టేజీ జాతీయ రహదారి సమీపంలో ఉంటుంది. అయితే సోమవారం రాత్రి వైన్ షాపునకు మద్యం లోడు వచ్చినట్లు తెలిపారు. మద్యం మొత్తం లోపల పెట్టి తాళం వేసి వెళ్లారు. ఉదయం చూసే సరికి ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు మద్యషాపు షటర్ పగలగొట్టి అందులో ఉన్న మద్యం మొత్తం ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. అదేవిధంగా సీసీ కెమెరాలను, డివైజ్‌ను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. చోరీకి గురైన మద్యం విలువ రూ.5.20 లక్షలు ఉంటుందని తెలిపారు. అయితే ఈ చోరీ తెలిసిన వారే చేసి ఉంట